# ధైర్యవాణి

## 'కన్యాశుల్కం' నాటకంలోంచి ఏ దృశ్యాన్ని ఎంచుకోవాలి అని వాళ్లు తర్జన భర్జన పడుతున్నారు.

గురజాడ జయంతి సందర్భంగా నాటక ప్రదర్శన ఏర్పాటు చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. ఆ ప్రయత్నిస్తున్న వాళ్లంతా 'మిత్రసమితి' సభ్యులు.

మధురవాణి వేషం వెయ్యడానికి దొరికినవాళ్ళలో ఒకామె బాగా లావుగా ఉందనీ, మరొకామె మరీ సన్నగా ఉందనీ, లేకపోతే ముఖం ఆకర్షణీయంగా లేదనీ, వాచికం బాగాలేదనీ ఏదో వంక పెడుతున్నారు.

మధ్య మధ్య టీలూ టిఫిన్లూ అందిస్తూ వాళ్ళ చర్చలన్నీ యథాలాపంగా వింటున్న సాధనకి తనని కూడా చర్చలో పాల్గొనమని అడిగితే బావుండునని పించింది. కాని, టీలూ టిఫిన్లూ తప్ప తన నుంచి ఇంకేమీ ఆశించలేదు ఎవరూ. వాళ్ల చర్చలు వింటూ నిశ్శబ్దంగా ఊరుకుంది. వాళ్ల ఎదురుగా ఏమీ అనలేదు.

ఆ రాత్రి భర్తతో ఏకాంతంలో ఉన్నప్పుడు మధురవాణి ప్రస్తావన తీసుకొచ్చింది.

"చివరికి మీరంతా ఏం నిర్ణయించారు? ఎవర్ని తీసుకుంటున్నారు మధురవాణి వేషానికి?" అంది సాధన.

"ఒక్కర్తీ లేదు సరియైనది - అందుకే మధురవాణి పాత్ర లేని 'సారాదుకాణం' సీను వేద్దామనుకుంటున్నాం" అన్నాడు సత్యమూర్తి.

"ఛీ, బొత్తిగా ఆ 'సారాదుకాణం' సీను వేస్తే ఏం బావుంటుందండీ? మీ పాడలవాటు ఇందులో కూడా ప్రదర్శించాలా?" అంది ఒళ్ళుమండి.

"నీ మొహం! 'సారాదుకాణం' సీను ప్రాముఖ్యం నీకేం తెలుసు? అందులో ఎంత హాస్యం ఉందో, ఎంత తాత్త్విక చర్చ ఉందో తెలుసా? దానికెంత విశ్వజనీనత ఉంది! 'కన్యాశుల్కం' శ్రద్ధగా చదివావా అసలు?!" అంటూ తేలిగ్గా కొట్టి పారేశాడు సత్యమూర్తి.

అంతటితో తల వంచలేదు సాధన.

"కన్యాశుల్కంలో ఇంకో ఆసక్తికరమైన సన్నివేశమే దొరకలేదా మీకు? అసలు గిరీశం, మధురవాణీ లేకుండా ఏం బావుంటుంది ప్రదర్శన?" అంది.

సత్యమూర్తి వెటకారంగా నవ్వి "నీ జీవితంలో గిరీశం, వెంకటేశం ఉన్న మొదటి సీనే చూసుంటావ్! లేకపోతే గిరీశాన్ని హీరోగా చేసిన సినిమా చూసుంటావ్!" అన్నాడు.

వెంటనే ఏమనాలో స్ఫురించలేదు సాధనకి. ఒక్కక్షణం మౌనం వహించింది. అదే అదనుగా తీసుకుని "చూశావా! అదే సామాన్యులకీ మేధావులకీ ఉన్న తేడా!" అన్నాడు కళ్లలో కొంటెతనం ప్రదర్శిస్తూ.

"ఓహో! మేధావులకీ, సారాదుకాణానికీ అవినాభావ సంబంధం ఉంటుందని నాకు తెలియదులెండి!" అంది సాధన భర్త మేధావుల మాట ఎత్తేసరికి చిర్రెత్తుకొచ్చి. మనసులో ఆలోచనలు ఉవ్వెత్తున లేచాయి.

సారాదుకాణం దృశ్యాన్ని రంగస్థలం మీద ప్రదర్శించడం అనే ఊహనే భరించలేకపోతోంది సాధన. ఎంత గొప్ప నాటకం అయినా తాగుడు దృశ్యాన్ని రంగస్థలం మీద ఎలా భరించడం? అసలు మగవాళ్లు ఎందుకు తాగుతారో అర్థం కాదు. కష్టమొచ్చినా సుఖమొచ్చినా వెంటనే సిగరెట్లూ సీసా అందుకుంటారీ మగవాళ్లు. ఏం? ఆడవాళ్లకు కష్టసుఖాలుండవా? వాళ్లు తమ అనుభూతుల్నీ ఆవేదనల్నీ ఎలా అణచుకుంటున్నారు? ఎలా ప్రదర్శిస్తున్నారు? చూసైనా నేర్చుకోవచ్చుగా మగవాళ్లు! పోనీ, ఆ తాగుడు, సిగరెట్ల వల్ల ఏమైనా లాభం ఉందా అంటే ఇటు ఆర్యోగం, అటు ఆదాయం - రెండూ తరిగిపోతాయి. మద్యపాననిషేధంతో పాటు రంగస్థలం మీదా, సినిమాల్లోనూ మద్యపానం దృశ్యాలను కూడా నిషేధిస్తే బావుండును. మాటకి ముందు సిగరెట్టు వెలిగించుకోవడం, పొగఊదడం, గ్లాసు నింపుకోవడం ఫేషనైపోయింది. చేతుల్లో సిగరెట్లు గ్లాసూ లేకపోతే ఈ మగవాళ్లు అసలు నటించగలరా? ఆ ఉత్తచేతుల్తో ఏం చెయ్యాలి వాళ్లు?! ఈ మేధావులు ఇంక ఏం చెయ్యగలరు! అనుకుంటూ,

"మీ మేధావుల్ని ఆకట్టుకునే దృశ్యం ఇంకేదీ లేదా మొత్తం నాటకంలో?- పోనీ, గిరీశం, మధురవాణీ లేనివే!" అంది ఏమంటాడో చూద్దామని.

"నువ్వు చదివి చెప్పు రేపు" అంటూ చర్చ ముగించడానికి సూచనగా అటు తిరిగి పడుకున్నాడు.

సాధన వదల్లేదు. రేపు మళ్లీ ఈ టైము వరకూ మీకు తీరిక ఉండదు కదా నాతో

మాట్లాడటానికి! ఏమండీ, నిజం చెప్పండి. మధురవాణిగా వెయ్యడానికి ఎవ్వరూ దొరకలేదా?' ' అని ఎంతో అమాయకంగా అడిగింది.

"అవునే, లేకపోతే ఎందుకు తీసుకోము?'' అన్నాడు.

"పోనీ, నేను వెయ్యనా? నేను సరిపోతానా?''

"ఛీ!'' అన్నాడు ఇటు తిరక్కుండానే.

"ఏం, తప్పేముంది?'' అని రెట్టించింది. ఆ కంఠంలోని గంభీర్యాన్ని గుర్తించి, ఇటువైపు ఒత్తిగిలి సత్యమూర్తి భార్య ముఖంలోకి గుచ్చిచూస్తూ -

"నీకేమన్నా మతిపోయిందా? నలుగురూ ఏమనుకుంటారు?'' అన్నాడు కరుకుగా.

సాధన కళ్లలో నీరు ఉబికింది. అతని కళ్లబడకుండా చటుక్కున ఇటు తిరిగి పడుకుంది. సత్యమూర్తి కూడా మారు మాట్లాడకుండా మరోవైపుకి తిరిగి పడుకున్నాడు.

పడుకుందన్న మాటేగాని, సాధనకి నిద్రపట్టలేదు. ఆలోచనలు ఈగల్లా ముసిరి వేధిస్తూంటే ఆవేదనతో మనస్సు గిజగిజలాడింది. తను మధురవాణి పాత్రను నటించాలనుకోవడం అంత ఛీత్కరించుకోవలసిన విషయమా? మరొక అందమైన తెలివైన తప్పా? పెళ్లికాక ముందు తనను అందరూ మెచ్చుకున్న వాళ్లేగా. ఇప్పుడు పెళ్లయ్యాక నటించడం - మధురవాణిగా నటించడం అంత ఘోరమయిన విషయమా? సారాదుకాణానికి వెళ్లితాగడం, తాగుతున్నట్లు రంగస్థలం మీద నటించడం ఇవన్నీ మగవాళ్లు చేస్తే చెల్లుతోందేం? భర్త నాటకానికి దర్శకత్వం వహిస్తే తప్పులేదు; భర్త స్నేహితులు - పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసేవాళ్లు - పెళ్లయిన వాళ్లు ఏ రకం పాత్రలు ధరించినా తప్పులేదు; ఇంకెవరి భార్యో వేషం వేస్తే తప్పు లేదు; తను మాత్రం వెయ్యడానికి పరువు అడ్డొస్తుందిట! మధురవాణిగా వేస్తాననగానే 'ఛీ!' ట!.. ఏం మధురవాణి పాత్రని మేధావులంతా ప్రశంసిస్తారుగా అప్పారావుగారి అద్భుత సృష్టి అని! అయినా, వేశ్యగా నటిస్తే వేశ్య అయిపోతుందా? ఆ వేశ్య దగ్గరికి పోయే విటుడిగా ఓ సంసారి నటిస్తే తప్పులేదా? ఈ వివక్షతని ఈ అన్యాయాన్ని ఎదుర్కోవడం ఎలా?... ఎలాగో తెలియక, తన సామర్థ్యాన్ని రుజువు చేసుకోవడం ఎలాగో, తన అభిరుచి ప్రకారం ప్రవర్తించడం ఎలాగో అర్థం కాక సతమతమవుతూ ఆలోచనల్లో పడి కొట్టుకుని కొట్టుకుని ఎప్పుడో అర్ధరాత్రి దాటాక నిద్రలోకి ఒరిగింది.

మర్నాడు పొద్దున్న లేచి యథావిధిగా నిత్యకృత్యాలన్నీ పూర్తి చేసింది. వంట చేసి భోజనం పెట్టి భర్తని ఆఫీసుకి సాగనంపాక, తక్కిన పనులన్నీ మూలకి నెట్టి 'కన్యాశుల్కం' చదువుతూ కూచుంది. సాయంత్రం అయిదు గంటలకి పనిమనిషి వచ్చేవరకూ పుస్తకం వదల్లేదు. భర్త వచ్చేసరికి కాఫీ, టిఫినూ సిద్ధం చేసి, రాత్రికి అన్నం కూడా వండేసింది.

భర్త వచ్చిన ఒక గంటకి మిత్రులు కూడా చేరారు. నాటకం గురించి చర్చించు కోవడానికి. వాళ్లకి టీ ఇచ్చాక లోపలికి వెళ్లిపోకుండా, తనూ ఓ కుర్చీలాక్కుని భర్తకి కొంచెం ఎడంగా కూచుంది. వాళ్లంతా తెల్లబోయినట్లు ఒక్క క్షణం నిశ్శబ్దం వహించి, మళ్లీ చర్చ కొనసాగించారు. సారా దుకాణం దృశ్యమే నిర్ణయించి, ఏ పాత్ర ఎవరికి ఇవ్వాలో ఆలోచిస్తున్నారు.

సాధన మధ్యలో కలగజేసుకుని 'ఆరో అంకంలో ఆఖరి దృశ్యం గానీ, నాలుగో అంకంలో మొదటి దృశ్యంలో కొంత భాగం గానీ వేసుకోవచ్చు కదండీ' అంది ధైర్యం చేసి.

సత్యమూర్తి భార్య కేసి చూడనైనా చూడకుండా బిగదీసుక్కూర్చున్నాడు. ఆమె చేసిన ప్రస్తావనకి స్పందించి దాన్ని పొడిగించ దలచుకోలేదు. సమాధానం స్నేహితులకే వదిలేశాడు.

"మిసెస్ మూర్తీ, మీరన్నట్లు ఆ దృశ్యాల్లో ఏదైనా ప్రదర్శనకి అద్భుతంగా ఉండేమాట నిజమే. కాని అందుకు అనువైన మధురవాణి దొరకడం కష్టంగా ఉందండీ. అందుకే, ఆ పాత్రలేని దృశ్యాన్ని ఎంచుకున్నాం" అన్నాడు రామరాజు అనే అతను.

"పోనీ, నన్ను వెయ్యమంటారా? నాకేం అభ్యంతరం లేదు" అంది మృదువుగా నవ్వుతూ.

అంతా పకపకా నవ్వేశారు అదేదో పెద్ద జోకయినట్లు. సత్యమూర్తి మాత్రం బిగుసుకుపోయాడు.

"నిజంగానే నండీ, కాలేజీ రోజుల్లో నటనలో ఫస్టుప్రైజు ఎప్పుడూ నాకే వచ్చేదండీ" అంది సాధన. "పైగా, నా ప్రతిభనీ నన్నూ చూసే కదండీ మా వారు నన్ను చేసుకున్నది!' ' అంది సమ్మోహనంగా నవ్వుతూ.

"ఓ! అలాగా! అంతకన్నానా! చెప్పరేమండీ మూర్తిగారూ? ఇంత టాలెంట్‌ని ఇంట్లో పెట్టుకుని?" అన్నారు జోగారావు గారు. ఆయన అందరిలోకీ పెద్దవాడు - హెడ్ మాస్టరుగా చేసి రిటైరయినవాడు.

అటువంటి పెద్దాయనే అంత ప్రోత్సాహకరంగా మాట్లాడేసరికి సత్యమూర్తి ఏమీ అనలేకపోయాడు. ఇబ్బందిగా చిరునవ్వు నవ్వాడు.

సాధన లోలోపల నవ్వుకుంది - ఎవరైనా ఏమనుకుంటారో, సమాజం ఏమనుకుంటుందో అనే భయాన్ని వదిలించుకోవడం ఎంత సులభం - నిజంగా తలచుకోవాలేగాని! ఆ సమాజం ఎక్కడుంది? ముందుగా తనలోనేగా!.

*ఆకాశవాణి సౌజన్యంతో 23.10.95 నాడు ప్రసారితం*

*ఆహ్వానం, ఏప్రిల్ ' 96*